మొగిలి క్షేత్రానికి కార్తీక శోభ

- ప్రారంభమైన కార్తీక మాసం
- దీపాన్ని దైవ స్వరూపంగా భావిస్తూ పూజలు
- కార్తీక సోమవారాల్లో ఆలయాన్ని సందర్శించనున్న వేలాది భక్తులు
- దేవరకొండ జలకంఠేశ్వరాలయంలో నిత్యాన్నదానం



మొగిలి శైవ క్షేత్రానికి అనుబంధంగా ఉన్న దేవరకొండ జలకంఠేశ్వరాలయం, (ఇన్‌సెట్) పార్వతీసమేత జలకంఠేశ్వరస్వామి

బంగారుపాళెం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలో ప్రసిద్ధి చెందిన మొగిలి శైవక్షేత్రం ముస్తాబైంది. స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారిని దర్శించుకునేందుకు జిల్లా నలు మూలల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మొగిలి శైవక్షేత్రానికి తరలివస్తుంటారు. ఈ నెల 2వ తేదీ నుంచి శివునికి ప్రీతిపాత్రమైన కార్తీక మాసం ప్రారంభమైంది. మొగిలి శివాలయంతో పాటు అనుబంధ ఆలయమైన దేవరకొండ జలకంఠేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మండలంలోని శైవక్షేత్రాల్లో ఇక ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నారు. సోమవారాలు, కార్తీక పౌర్ణమితో పాటు ఇతర రోజుల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో అధికారులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్వామివారిని దర్శించుకునేలా తగిన ఏర్పాట్లు చేపట్టారు.

దీపారాధన ప్రత్యేకత

కార్తీక మాసం శివుడికి ప్రీతి పాత్రమైన మాసం. ఈ నెల రోజులను అత్యంత పవిత్రమైన రోజులుగా శైవులు భావిస్తారు. ఈ మాసంలో దైవభక్తితో ఉంటే ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలుగుతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఈ మాసంలో మహిళలు వ్రతాలు, నోములు ఆచరిస్తారు. మరోవైపు కార్తీక మాసంలో దీపారాధనకు ఎంతో పాధాన్యం ఉంది. దీపారాధన అనేక శుభాలు కలుగజేయడమే కాకుండా అంతులేని ఆరోగ్యభాగ్యాలను ఇస్తుందని భక్తుల నమ్మకం. దీపాన్ని దైవ స్వరూపంగా భావించి పూజలు చేస్తారు. కార్తీక సోమవారాల్లో చేసే దీపారాధన, ఉసిరి చెట్టుకింద పూజలు వనభోజనాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పండితులు చెబుతున్నారు.


మొగిలి శివాలయం

శివకేశవులకు సమ ప్రాధాన్యం

కార్తీక మాసం శివుడికి, విష్ణువుకి ప్రీతికరమైంది. అందుకే ఈ మాసంలో ప్రతి సోమవారం శివుడికి, ప్రతి శుక్ర, శనివారాల్లో విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తారు. శివపార్వతుల పుత్రుడు అయ్యప్పదీక్షలు ఈ మాసంలోనే ప్రారంభమవుతాయి. శివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చనలు, విష్ణుమూర్తికి తులసీ దళార్చనలు ఈ మాసంలోనే అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. లక్ష్మీదేవి, కార్తికేయుడు, చంద్రుడు, ఇంద్రుడు, తులసీమాత, ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తే శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందులో భాగంగా కార్తీక స్నానం, దీపారాధన, ఉపవాసం, దానధర్మాలు, సోమవార వ్రతాలు ముఖ్యమైనవి. మండలంలోని కేజీ సత్రంలోని సిద్దేశ్వరకొండలో వెలసిన శ్రీపార్వతీ సమేత సిద్దేశ్వరస్వామికి ఆలయంలోనూ కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు.

దేవరకొండ జలకంఠేశ్వరాలయంలో..

మొగిలి శివాలయానికి అనుబంధ ఆలయమైన దేవరకొండపై శ్రీజలకంఠేశ్వరస్వామి కొలువై ఉన్నారు. మొగిలికి ఐదు కిలోమీటర్ల దూరంలో కొండిన్య అటవీ ప్రాంతంలో దేవరకొండ ఉంది. కొండపై శ్రీ పార్వతీసమేత జలకంఠేశ్వర స్వామి నిత్యపూజలు అందుకుంటున్నారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకునేందుకు దేవరకొండకు వస్తుంటారు. ఇక్కడ ప్రతి పౌర్ణమి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులు భజనలు, శివకోటి పారాయణం చేస్తుంటారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మూడు పూటలా అన్నదానం చేస్తున్నారు.

బురుజుపై కార్తీక దీపోత్సవం

దేవరకొండపై ఏర్పాటు చేసిన బురుజుపై ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. తమిళనాడులోని అరుణాచలంలో నిర్వహించే రోజునే ఇక్కడా కార్తీక దీపోత్సవం ఉంటుంది. ఈ కార్తీక దీపాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు రానున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేసినట్లు మొగిలి శివాలయ కార్యనిర్వహణాధికారి మునిరాజులు తెలిపారు.

క్లుప్తంగా

ఇంటి వద్దే ఉచిత వైద్యం


వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు పైసా ఖర్చులేకుండా, సమయం వృథా కాకుండా ఇంటివద్దే వైద్యసేవలు అందుతున్నాయని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ రష్మిత అన్నారు. మండలంలోని తిమ్మాపల్లె గ్రామంలో సోమవారం ఆమె ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిబిరం ఏర్పాటుచేసి ఓపీ(అవుట్ పేషెంట్) సేవలందించారు. 65 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపైన ఉన్న రోగులకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, సరళ, శిల్ప, సరిత, శివగామిలు పాల్గొన్నారు.

విద్యార్థులందరూ బ్లడ్ గ్రూప్ తెలుసుకోవాలి


విద్యార్థులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: ప్రతి విద్యార్థి తన బ్లడ్ గ్రూప్ తెలుసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ప్రత్యేక రక్త పరీక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత రక్తపరీక్ష వైద్య శిబిరంలో ల్యాబ్ టెక్నీషియన్ అజారుద్దీన్ 80 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు చేసి వారి బ్లడ్ గ్రూప్‌లను తెలియజేశారు. డాక్టర్ మాట్లాడుతూ బ్లడ్ గ్రూప్ తెలుసుకుంటే ఆపద సమయంలో సులువుగా ఆ గ్రూపు రక్తాన్ని అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయ్‌కుమార్ హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఏఎన్ఎం జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ పాల్గొన్నారు.

చిత్తూరులో హోంమంత్రి అనిత

చిత్తూరు అర్బన్: రాష్ట్ర హోంశాఖా మంత్రి అనిత సోమవారం చిత్తూరుకు వచ్చారు. తిరుపతి నుంచి అనంతపురం వెళుతూ చిత్తూరు నగరంలోని పోలీసు అతిథి గృహానికి చేరుకున్నారు. కొద్దిసేపు తరువాత ఆమె అనంతపురం బయలుదేరి వెళ్లారు. మంత్రిని స్థానిక ఎమ్మెల్యే గురజా జగన్ మోహన్ నాయుడు, ఎస్పీ మణికంఠ, టీడీపీ జిల్లా పార్టీ మహిళా అధ్యక్షురాలు అరుణ కలిశారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరుచుకోవాలని సూచించారు. చిన్నారులకు జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు, వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వినతులపై నిర్లక్ష్యం వద్దు


దివ్యాంగుడి సమస్యలు వింటున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అందే వినతులపై నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్వీకరించారు. ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వినతులను విచారించి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గణిత శాస్త్రాభివృద్ధికి శకుంతలాదేవి కృషి


శకుంతలాదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: గణిత శాస్త్రాభివృద్ధికి శకుంతలాదేవి చేసిన సేవలు శ్లాఘనీయమని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం వేణురెడ్డి అన్నారు. ప్రముఖ గణిత మేధావి శకుంతలాదేవి జయంతిని సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో శకుంతలాదేవి చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం వేణురెడ్డి మాట్లాడుతూ, శకుంతలాదేవి గణిత శాస్త్రం, ఖగోళ శాస్త్రం, జ్యోతిష్యశాస్త్రాలపై పట్టు సాధించి ప్రపంచంలో గొప్పమేధావిగా గుర్తింపు పొందారన్నారు. కంప్యూటర్ కంటే వేగంగా పలు గణిత సమస్యలను పరిష్కరించి గిన్నీస్ రికార్డును సొంతం చేసుకున్నారని చెప్పారు. అందుకే అమెను మానవ గణన యంత్రం (హ్యూమన్ కంప్యూటర్) అని పిలుస్తారని తెలిపారు. గణిత ఉపాధ్యాయులు దేవకి, కేశవులు మాట్లాడుతూ, 1929 నవంబరు 4న బెంగళూరు నగరంలో ఓ బ్రాహ్మణ కుటుంబంలో శకుంతలాదేవి జన్మించారన్నారు. చిన్నతనంలోనే గణితంపై పట్టు సాధించి ప్రశంసలు అందుకున్నారని చెప్పారు. 2013లో శకుంతలాదేవి స్వర్గస్తులయ్యారని తెలిపారు. విద్యార్థులు శకుంతలాదేవిని ఆదర్శంగా తీసుకుని గణిత మేధావులుగా ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు గణితంపై పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షంషీర్ ఖాన్, వెంకటస్వామి, వెంకటరమణ, జయప్రకాష్, విజయకుమారి, అన్నపూర్ణదేవి, శుభలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య గణన సమగ్రంగా చేపట్టాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డి

తవణంపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే నైపుణ్య గణన (స్కిల్ డెవలప్‌మెంట్) సమగ్రంగా చేపట్టాలని ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం, వెలుగు కార్యాలయంలో నైపుణ్య గణనపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ రెడ్డిబాబు మాట్లాడుతూ నైపుణ్యం యాప్‌లో ఇంటింటి సర్వే చేసి 15 ఏళ్ల వయసు నుంచి 59 ఏళ్ల వయసు కలిగిన వారిని గణన చేసి పూర్తి వివరాలతో నమోదు చేయాలని సూచించారు. ఈ సర్వేలో 8 రకాల అంశాలను పూర్తిచేయాలని ఆయన వివరించారు. దీంతోపాటు యాప్‌లో విద్యార్హతలు, నివాసం, ఉద్యోగం, శిక్షణ తదితర వివరాలను సేకరించి నమోదు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో రోజా


గురుదక్షిణామూర్తి సన్నిధిలో మాజీ మంత్రి రోజా

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం మాజీ మంత్రి రోజా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, ప్రసాద్, ఈశ్వర్‌సాయి, ముని తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్లంలో ఎస్పీ దంపతులు


గుడిమల్లంలో ఎస్పీ దంపతులు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం శ్రీ పరశురామేశ్వర స్వామి ఆలయాన్ని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోల్, ఆయన సతీమణి రైల్వే డీఎస్పీ హర్షిత సందర్శించారు. కార్తీక సోమవారం సందర్భంగా స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. రాహుకాల అభిషేకంలో వారు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి మంగళ వాయిద్యాలు వేదమంత్రాలతో ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి ఆహ్వానం పలికారు. వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వామివారి చిత్రపటాన్ని అందించారు. వేద పండితులు ఆశీర్వాదం చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మల్లకుంటలో మహిళలకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని, వేపాకు పొగ వేయాలని సూచించారు. తవణంపల్లె పీహెచ్‌సీలో ప్రసవాలు చేస్తున్నట్లు వివరించారు. గర్భిణులకు రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గర్భవతులకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లకుంటలో ఉచిత వైద్య శిబిరం

మండలంలోని మల్లకుంటలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ గర్భిణులకు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని వివరించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక దీపారాధన



బంగారుపాళెం: మొగిలి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు, చిత్తూరు: చిదంబరేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన చేస్తున్న మహిళలు

బంగారుపాళెం: మండలంలోనే ప్రసిద్ధి గాంచిన మొగిలి శివాలయంలో సోమవారం కార్తీక పూజలు ఘనంగా నిర్వహించారు. తెలుగు కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా ఉదయం శ్రీకామాక్షిసమేత మొగిలీశ్వరస్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారిని దర్శించుకున్నారు. కార్తీక మాసంలో పరమశివున్ని దర్శించుకుని పూజలు నిర్వహిస్తే జీవితంలో కష్టాలు తొలగి సుఖశాంతులు కలుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు రెడ్డెప్ప గురుకుల్ తెలిపారు.

రాహుకేతు పూజలు

ఆలయం ఆవరణలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించారు. రాహుకాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య ప్రత్యేక పూజలు రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి మునిరాజులు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

కార్తీక సోమవార పూజలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అనుబంధమైన మణికంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మొదటి సోమవార కార్తీక పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు. ఉదయం స్వామివారికి సుగంధ ద్రవ్యాలు, రుద్రాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఆవరణలోని ఉసిరి చెట్టు కింద దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తులతో దీపారాధన చేశారు.

శివాలయాల్లో అభిషేక పూజలు

చిత్తూరు నగరంలోని శివాలయాల్లో కార్తీక మాసపు తొలి సోమవారం పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కట్టమంచిలోని కుళందీశ్వరస్వామి ఆలయం, ఈశ్వర గుడి వీధిలోని అగస్తీశ్వరస్వామి ఆలయం, గిరింపేటలోని చిదంబరేశ్వరస్వామి ఆలయం, ఇరువారంలోని నాగేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం అభిషేక పూజలు చేశారు. అనంతరం శివలింగాన్ని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం మహిళలు దీపారాధన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం కూడా మహిళలు ఆలయాలకు పోటెత్తడంతో కిక్కిరిసిపోయాయి. శివనామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి.




కాణిపాకం: దీపాలు వెలిగిస్తున్న మహిళలు, చిత్తూరు: పరమేశ్వరుడి దర్శనానికి వచ్చిన భక్తులు, ప్రత్యేక అలంకరణలో శివలింగం

హామీలు నెరవేర్చకపోతే తిరుగుబాటు తప్పదు


ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

తవణంపల్లె: ఎన్నికల హామీలను నెరవేర్చకపోతే సీఎం చంద్రబాబుపై తిరుగుబాటు తప్పదని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.జనార్దన్ హెచ్చరించారు. రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు సోమవారం మండలంలోని అరగొండ సచివాలయం దగ్గర నిరసన తెలియజేశారు. అనంతరం అరగొండ సచివాలయ కార్య నిర్వహణాధికారి మురుగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.జనార్దన్, కార్యదర్శి మునిరత్నం నాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబు రైతులకు పెట్టుబడి సాయం రూ.13,500 నుంచి రూ.20 వేలుకు పెంచి ఇప్పటి వరకు మాట నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించడం దుర్మార్గమన్నారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించి హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కరువు మండలాల ప్రకటనలో వివక్ష చూపరాదన్నారు. పాడి రైతులను ఆదుకోవడానికి వెంటనే విజయడైరీని ప్రారంభించాలని, చక్కెర ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని, హంద్రీనీవా కాలువ పూర్తి చేయాలని, విశాఖ ఉక్కును ప్రైవేటు చేయరాదని, కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవఅధ్యక్షులు ఎస్.నాగరాజన్, రైతు నాయకులు బాలచందర్, అశోక్, రామచంద్ర, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : మహిళలు రొమ్ము క్యాన్సర్ (బ్రెస్ట్ క్యాన్సర్) పట్ల అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో రొమ్ము క్యాన్సర్ నిర్మూలనకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ 35 ఏళ్లు నిండిన మహిళలు రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్‌ను గుర్తించడం ద్వారా నివారించుకోవచ్చని తెలిపారు. గతంలో కుటుంబంలో ఎవరికైనా క్యాన్సర్ ఉంటే ఆ కుటుంబంలోని మహిళలు కచ్చితంగా టెస్టులు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్‌పై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఅండ్‌హెచ్ఓ ప్రభావతిదేవి, ఐసీడీఎస్ పీడీ హేమావతి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో

నింద్ర : ఉపాధ్యాయులు బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని డీవైఈఓ ప్రభాకర్‌రాజు పేర్కొన్నారు. మండల కేంద్రమైన నింద్ర జిల్లా ఉన్నత పాఠశాలను సోమవారం పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థుల హాజరు వివరాలు, బోధనా అంశాలపై ఆరా తీశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.